ఒకే కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగాలు

టీచర్ పోస్టులు సాధించిన అక్కాచెల్లెళ్లు.. బాబాయి, అబ్బాయి

గోవిందరావుపేట, అక్టోబర్ 8: డీఎస్సీలో ఒకే కుటుంబానికి చెందిన పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండల కేంద్రానికి చెందిన బండ రవీందర్‌రెడ్డి - లావణ్య దంపతుల కుమార్తెలు చందన, మానస ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక య్యారు. తండ్రి బండ రవీందర్‌రెడ్డి పదేళ్ల క్రితం మృతి చెందగా తల్లి, మేనమామ స్ఫూర్తితో ఉద్యోగాలు సాధించారు. ఇటీవల ప్రకటించి డీఎస్సీ ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించడంతో పలువురు అభినందిస్తున్నారు. కాగా, మండల కేంద్రంలో నిరుపేదలైన దాసరి రామదాసు-పుష్పలత కుమార్తె అనూష ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. ఎస్‌జీటీ హిందీ విభాగంలో ఉద్యోగం పొందగా పలువురు అభినందించారు.

బాబాయి.. అబ్బాయికి ఉద్యోగాలు

మహాదేవపూర్: మండలంలోని బొమ్మపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన తలుగు ప్రవీణ్ కుమార్, బాబాయి తనుగు సుధాకర్‌కు డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రవీణ్ కుమార్ మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించగా, బాబాయి సుధాకర్ రెండో ప్రయత్నంలో విజయం సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

అక్కాచెల్లెళ్లు చందన, మానస

స్రవంతి

తలుగు ప్రవీణ్ కుమార్, సుధాకర్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

ఏటూరునాగారం/ తాడ్వాయి/ వాజేడు, అక్టోబర్ 8: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దిన్ అన్నారు. మంగళవారం మండలంలోని మాజీ నక్సల్స్, సానుభూతిపరులకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కన్పిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. దసరా పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. తాడ్వాయి మండలంలోని మాజీ మిలిటెంట్లకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని కామారంలో పోలీస్ గ్రామసభ నిర్వహించారు. సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. మావోయిస్టులకు గతంలో సహకరించిన వారికి వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి పలు సూచనలు, హెచ్చరికలు చేశారు.

ఏటూరునాగారం: కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాస్

సీపీఎం నూతన మండల కమిటీ ఎన్నిక

మహాముత్తారం, అక్టోబర్ 8: మండల కేంద్రంలోని పోలంపల్లిలో సీపీఐ మహాముత్తారం మండల ద్వితీయ మహాసభలు జరిగాయి. మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా పోలం చిన్న రాజేందర్, సోషల్ మీడియా బాధ్యుడిగా గట్టు శంకర్, మండల కమిటీ సభ్యులుగా మానేటి బాబు, మరికొందరు ఎన్నికయ్యారు.

ములుగు రూరల్ : బతుకమ్మల వద్ద ములుగు అదనపు కలెక్టర్లు, అధికారులు

బతుకమ్మల వద్ద ములుగు ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. బతుకమ్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 8: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒకచోట పెట్టగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ కిరణ్ ఖరే, సతీమణి దిశ మహిళా పోలీస్ ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులతో పాటలకు సంబురంగా ఆడారు. మహిళా పోలీస్ అధికారులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంతో పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, కష్టాలను తొలగించాలని గౌరమ్మను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అదనపు ఎస్పీ ఆపరేషన్ బోనాల కిషన్ దంపతులు, భూపాలపల్లి, కాటారం, డిఎస్పీలు ఏ సంపత్‌రావు, జి రామ్మోహన్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కేంద్రంలో..

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ వద్ద ఎస్పీ పీ శబరీష్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళా పోలీస్‌లు ఆడారు. అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

ములుగు కలెక్టరేట్ ఆవరణలో..

ములుగు రూరల్ : కలెక్టరేట్ ఆవరణలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు పోలు రాజు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మహిళా ఉద్యోగులు పాల్గొని బతుకమ్మలను ఆడారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడుతూ బతుకమ్మ అంటే పూల పండుగ అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, రాజేశ్వర్‌రావు, లాల్‌నాయక్, ఏఓ రాజ్‌కుమార్, డీడబ్ల్యూఓ శిరీష పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: బతుకమ్మ వేడుకల్లో ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు, పోలీస్ అధికారులు

ఎంపీడీఓ కార్యాలయం వద్ద..

గోవిందరావుపేట: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించగా మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను కాల్వల్లో నిమజ్జనం చేశారు. మహిళా ఉద్యోగులు సాయి దుర్గలక్ష్మి, ప్రసూన, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద..

కన్నాయిగూడెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. సీడీపీఓ ప్రేమలత, ఎంపిడివో అనిత, సూపర్‌వైజర్లు పుష్పవతి, శ్రీవిధ్య, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హాజరై బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు.

గోవిందరావుపేట: బతుకమ్మ వేడుకల్లో మహిళా ఉద్యోగులతో ఎంపీడీఓ జవహర్‌రెడ్డి

కన్నాయిగూడెం: బతుకమ్మలతో సీడీపీవో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 8: అమరజీవి గుర్రం వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, గుర్రం పల్లారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వెంకటేశ్వర్లు 14వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు మండలంలో పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి, గిరిజన కోసం పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దావూద్, వాసు, కుమ్మరి శ్రీను, ఆదినారాయణ, రాములు, పల్లారావు, నాగేశ్వర్‌రావు, మాణిక్యం, ప్రసాద్, బాబురావు, శ్రీను, రాము, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సంస్మరణ సభ

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 8: పౌర హక్కుల నేత బాలగోపాల్ 15వ సంస్మరణ సభను ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలగోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాజేడు మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు, మండల కార్యదర్శి చేలే రాజేశ్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి స్థలాలను ఏర్పాటు చేయాలి

సుకుమార్

మంగపేట, అక్టోబర్ 8: వానాకాలంలో పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి అనుకూలమైన స్థలాలను ఏర్పాటు చేయాలని ములుగు జిల్లా తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాజమల్ల సుకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఆరబెట్టుకోవడానికి అనుకూలమైన స్థలాలు లేక తేమ తగ్గే వరకు పొలాల్లోనే ఆరబెడుతున్నారని, ఈక్రమంలో అకాల వర్షాలు కురిసి ఏటా ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి గ్రామ శివారులో ఎకరం నుంచి రెండు ఎకరాల్లోపు స్థలాన్ని రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు కేటాయించాలని కోరారు.

తాగునీటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయాలి

గాంధీనగర్‌లో నీటిశుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

గణపురం, అక్టోబర్ 8: తాగునీటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సిబ్బందికి సూచించారు. మండలంలోని గాంధీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని (మిషన్ భగీరథ) నీటిశుద్ధి కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. వివిధ గ్రామాల్లోని ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి పరీక్షల నిర్వహణ, నీటిశుద్ధి ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నీటిశుద్ధి కేంద్రం నుంచి రోజూ 30 ఎంఎల్‌డీ నీటిని భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని గణపురం, రేగొండ, గోరికొత్తపల్లి, చిట్యాల, టేకుమట్ల, మొగళ్లపల్లి, భూపాలపల్లి మండలాల్లోని ఆవాసాలకు సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గొల్లబుద్దారం తాగునీటిశుద్ధి కేంద్రం నుంచి రోజూ 9ఎంఎల్‌డీ నీటిని మల్హార్, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని ఆవాసాలకు, కోనంపేట నీటిశుద్ధి కేంద్రం నుంచి మల్హార్, భూపాలపల్లి మండలాల్లోని 23 ఆవాసాలకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రిజర్వాయర్ల నుంచి తీసుకున్న నీటిని శుద్ధి కేంద్రాల్లో శుభ్రపరిచి అన్ని పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని న్ని నీటిశుద్ధి కేంద్రాల పరీక్షల నిర్వహణకు సెంట్రల్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రిజిస్టర్‌లో నమోదు చేసిన నీటి పరీక్షల వివరాలను పరిశీలించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖలు చేపడుతున్న రహదారుల నిర్మాణాల్లో పైపులైన్లు దెబ్బతింటున్నాయని, ఆయా శాఖల అధికారులు రహదారుల నిర్మాణం చేపట్టే సమాచారాన్ని మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులకు ఇవ్వాలన్నారు. ఆయా అధికారులు రహదారుల నిర్మాణ ప్రతిపాదనల రూపకల్పనలో మిషన్ బగీరథ పైపులైన్ల వ్యయాన్ని చేర్చాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అధికారులతో కలిసి వివిధ అంశాలను పర్యవేక్షించి, సమర్థమైన నిర్వహణ, నీటినాణ్యతపై రికార్డులను తనిఖీ చేశారు. మిషన్ భగీరథ ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్ : పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికకు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ఐడీఓసీ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 1వ తేదీ కంటే ముందు డిగ్రీ, ఏదేని తత్సమాన అర్హతలు కలిగిన పట్టభద్రులు, 2018 నుంచి ఇప్పటివరకు మూడేళ్లు సేవా కాలం కలిగిన ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. కలెక్టర్, ఆర్డీవో, కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ఫారాలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేలని సూచించారు. పట్టభద్రులు ఫారం 18, ఉపాధ్యాయులు ఫారం 19 నింపాలన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, ఆర్డీవో మంగిలాల్ పాల్గొన్నారు.

సమ్మక్క బరాజ్ 34 గేట్లు బంద్

కన్నాయిగూడెం, అక్టోబర్ 8: మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద మంగళవారం 34 గేట్లను బంద్ చేసి గోదావరి నీటిని నిల్వ చేస్తున్నారు. ఎగువ నుంచి 94 వేల 600 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బరాజ్ మొత్తం 59 గేట్లు ఉండగా 25 గేట్లు మాత్రమే ఎత్తి 91 వేల 135 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బరాజ్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు, ప్రస్తుతం 1.12 టీఎంసీలకు చేరుకుంది.

మూడు మోటర్లతో దేవాదుల నీటి పంపింగ్

దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఫేస్ 3లోని మూడు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతోంది. మూడు మోటర్ల ద్వారా రోజుకు 875 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధాని లోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచనే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనే వారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్